## కథ

**చెన్నూరి రాంబాబు**

# చెంపదెబ్బ

"నిజాయితీ, హానెస్టీ, సిన్సియారిటీ ఇలాంటి మాటలకు కాలం చెల్లిపోయిన రోజులు" లంచ్ బ్రేక్‌లో మళ్లీ ఒక క్రొత్త చర్చకు తెర తీశాడు ప్రసాద్.

"అసలే ప్రభుత్వ ఉద్యోగాలన్నీ ఉంటాయో, ఊడతాయో తెలియని రోజులివి. ఇలాంటి టైంలో నువ్వు చెప్పే మాటలకు అర్థం లేదు" చర్చకు పునాది వేశాడు రామారావు.

"నేను చెప్పేది అదే... ఎప్పుడైతే ప్రపంచీకరణ అన్ని దేశాలలోనూ చొరబడిందో అప్పుడే ప్రభుత్వ ఉద్యోగాలన్నింటిని తగ్గిస్తూ పోవాలని అధికారంలో ఉన్న ప్రభుత్వం ఏదయినా, ఆ దిశగా సాగడం మొదలయ్యింది" తన పాయింట్‌ను మరింత బలంగా చెప్పసాగాడు ప్రసాద్.

"నేనొప్పుకోను. ఎప్పుడయినా సిన్సియర్‌గా మన పనిని మనం చేసినప్పుడు అదే మనల్ని కాపాడుతుంది" ప్రసాద్‌కు అడ్డుపడ్డాడు సాల్మన్.

లంచ్‌కు తను కూర్చున్నప్పుడల్లా ఇలా ఏదో ఒక అంశం మీద చర్చ పెట్టడం అలవాటే ప్రసాద్‌కు. అసలే ఆకలి మీదుంటారేమో చర్చ ఎప్పుడూ వాడిగా, వేడిగా నడుస్తూనే ఉంటుంది ఆ ప్రభుత్వ కార్యాలయంలో.

"ఇంతకీ నువ్వేమంటావయ్యా... ఉద్యోగం మానేసి అందరం పనికిరాని ఇలాంటి చర్చలు పెట్టాలంటావా?" ఆఫీస్‌లో పెద్ద తలకాయ అయిన సుందరం అన్నారు.

"నేనేమీ అనట్లేదు.. గ్లోబలైజేషన్ పుణ్యమా అని ఉద్యోగాల తీరులో మార్పు వచ్చేసింది. ఒక ప్రక్క కెరీరే ప్రాణంగా ఈ రోజు యువత పరుగులు తీస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాలంటే అందరికీ చులకన అయిపోయింది. ఒక ప్రక్క వీళ్లు పనిచేయరు అన్న స్టాంప్ ఎలాగూ వేసేశారు. ఐటి రంగంలో ఉన్న వాళ్లకి వచ్చే జీతంతో పోలిస్తే మనది ఏ మూల....మళ్లీ దీనికి ఈ రకమైన మాటలు ఒకటి... అందుకే అన్నీ వదిలేద్దాం... సిన్సియారిటీకి స్వస్తి పలుకుదాం... ప్రతి పనికి ఒక రేటు ఫిక్స్ చేసుకుందాం. ఈ పద్ధతి చాలా గవర్నమెంట్ ఆఫీసుల్లో ఉంది. మనం కూడా మొదలు పెడదాం అంటున్నా. తప్పా....?" ఆ రోజెందుకో ప్రసాద్ చాలా అప్‌సెట్ అయినట్టుగా అనిపించాడు అందరికీ.

అప్పటివరకు కల్పించుకోని వెంకట్రావు ఇక అప్పుడు కల్పించుకున్నాడు "నువ్వు చెప్పింది కరెక్టే అనుకుందాం. ఇప్పుడు దాని మీద అంత డిస్కషన్ దేనికి. నీకిష్టం లేదు సిన్సియర్‌గా ఉండడం.. ఉండకు. అందర్నీ ఎందుకు ఇలా ఇబ్బంది పెడతావు?"

"వెంకట్రావు నువ్వన్నది నిజమే కావచ్చు. కానీ మనం అంతా కూడా మిగిలిన వాళ్లని ఫాలో అవ్వాలని నా ఉద్దేశ్యం"

"చూడు ప్రసాద్... మన ఉద్యోగంలోనే మనం నిజాయితీగా పనిచేయనపుడు మన పిల్లలు మనల్ని చూసి ఏం నేర్చుకుంటారు. దీని ప్రభావం పిల్లల మీద ఉండదనా నీ ఉద్దేశ్యం" చాలా ఘాటుగా అడిగాడు వెంకట్రావు.

"ఇప్పుడు నువ్వు అసలు విషయంలోకి వచ్చావ్. మనం చాలా సిన్సియర్‌గా ఉండి పైసా వెనకేయలేనప్పుడు పిల్లలు మన సిన్సియారిటీని గుర్తుంచుకుంటారంటే నేన్నమ్మను. నువ్వు మీ అబ్బాయి 'నాకు మెక్‌డోనాల్డ్ పిజ్జా కావాలం'టే అది కొనివ్వలేకపోతే, నువ్వు తండ్రిగా ఫెయిలయ్యావనే అనుకుంటాడు ఆ కుర్రాడు" ఇంకొంచెం కుండ బద్దలు కొట్టినట్లు మాట్లాడాడు ప్రసాద్.

అందరికీ వీళ్లిద్దరి మధ్య వాద ప్రతివాదాలు ఆసక్తిని కలిగించడం మొదలుపెట్టాయి.

"ఒక్కసారి వెనక్కు వెళ్లు ప్రసాద్. మీ నాన్నగారు ఇప్పుడు నువ్వు మాట్లాడుతున్నట్టుగా మాట్లాడితే నువ్వు హర్షించేవాడివా! చేసే ఉద్యోగం కాదు, ఉద్యోగంలో ఎంత వెనకేశామన్నది ముఖ్యం అంటే జీవితానికి అర్థం లేకుండా పోతుందని అన్పించేది కాదూ నీకు... పైగా ఇన్నాళ్లు ఆ మార్గంలో వెళ్లలేదే అనే బాధపడతావా?" ఇంకొంచెం ఆవేశంగా అన్నాడు వెంకట్రావు.

"కరెక్టే... వెంకట్రావ్... జీవితాంతం నిజాయితీ, కష్టపడటం అన్న రెండు మాటలతోనే బతికాడు మా నాన్న. కానీ దాని ఫలితం ఏమిటో తెలుసా...? నేను ఇలా సీనియర్ అసిస్టెంటుగా సెటిల్ అవ్వాల్సి వచ్చింది. డాక్టర్ చదవాలన్న నా కోరిక తీరలేదు. కానీ ఆయన పనిచేసిన రోజుల్లో వచ్చిన అవకాశాలన్నింటిని పక్కకు నెట్టేసి మంచి పేరే సంపాదించుకున్నాడు. మరి మా అందరి సంగతి... ఆయన సిన్సియారిటీ పుణ్యమా అని మా అందరివీ అత్తెసరు బతుకులయ్యాయి. ఇదే నా జీవితాన్ని నా కొడుక్కి కూడా ఇవ్వమంటావా?" ప్రసాద్ మాటల్లో ఆవేశం కన్నా ఆవేదన ధ్వనించింది. ప్రసాద్ ఆర్గ్యుమెంట్ అక్కడితో ఆగిపోలేదు.

"వెంకట్రావ్ మన చుట్టూ ఏమవుతుందో గమనించు.. నెమ్మదిగా ఇడ్లీ, దోశల్ని... పిజ్జాలు, బర్గర్‌లు ఆక్రమిస్తున్నాయి. కూరగాయలక్కూడా రిలయన్స్ రిటైల్ లాంటివి వచ్చేశాయి. కిరాణా దుకాణాల్ని మింగేస్తూ సూపర్ మార్కెట్‌లు వచ్చేశాయి. మనం కూడా అప్పు చేసయినా బ్రాండెడ్ వస్తువులు కొనాలనుకుంటున్నాం. వీలున్న చోటల్లా టిప్ ఇచ్చి మన ఆనందాన్ని ప్రకటిస్తున్నాం. ఇలాంటి లైఫ్‌స్టైల్ కావాలనుకోవటం తప్పే అయితే గాలం వేసి చేపలు పట్టినట్టు ఎక్కడ చూసినా ప్రకటనల ప్రపంచమే సాక్షాత్కరిస్తుంటే, ఇవన్నీ నా పిల్లలకయినా ఇవ్వాలి అనుకోవటంలో తప్పేముంది. అయినా ప్రభుత్వాఫీసుల్లో ఏదో రకంగా లాభం పొందటానికే వస్తారందరూ. లాభంలో ఒక పది శాతం పనిచేసి పెట్టినందుకు మనం పొందితే తప్పేమిటి అని నేనడుగుతున్నాను. దానికి అపరాధ భావన అనవసరం అని నా ఉద్దేశ్యం"

ఈ వాదనలు వింటున్న వాళ్లందరికీ మతులు పోతున్నాయి. కొంతమందికి ప్రసాద్ మాటల్లో తప్పులేదనిపించింది. మరికొంత మందికి దీనివల్ల కొత్త ప్రమాదాలను కొని తెచ్చుకున్న వాళ్లమవుతామా అని ఆలోచించసాగారు.

"గ్లోబలైజేషన్ ఒక పెనుగాలిలా వచ్చి చుట్టుముట్టేస్తుంటే దాన్నుంచి కాపాడుకోవడం కోసం ప్రయత్నించాలి కానీ, నేనూ ఆ ప్రభంజనానికి ఒక సమిధగా మారుతాను అనటంలో అర్థం లేదు. నువ్వెంత ఆర్గ్యూ చేసినా నీ వాదనకు ఎన్ని పరిమళాలు అద్దినా, అది కేవలం నిన్ను నువ్వు సమర్థించుకోవటం తప్ప మరొకటి కాదని గుర్తుంచుకో ప్రసాద్"

వెంకట్రావు మాటలకు సమాధానమిచ్చే లోపే ప్రసాద్ సెల్ కార్మికులను షిఫ్ట్‌లోకి తరిమే సైరన్‌లాగ మోగింది.

"హలో ప్రిన్సిపల్‌గారా... నమస్కారమండీ"

"........"

"ఇప్పుడే రమ్మంటారా! అంతా ఒకే కదా! మావాడి గురించి రమ్మంటున్నారా చెప్పండి. మా వాడేదయినా ఘనకార్యం చేశాడంటే మాత్రం సంతోషిస్తాను"

"........"

"ఓకే.. ఒక్క అరగంటలో మీ ముందుంటాను"

"ఓకే ఫ్రెండ్స్.... మన చర్చ ఇక్కడితో అయిపోయిందనుకోకండి. స్వల్ప విరామం. రేపటి లంచ్ బ్రేక్ మన కోసం ఎదురుచూస్తూ ఉంటుందని మర్చిపోకండి. మా బుడతడు అప్పుడే నా రూట్లో సాగుతున్నట్టుగా అనిపిస్తోంది. ఎందుకో వాళ్ల ప్రిన్సిపల్ రమ్మని ఫోన్ చేశారు.



వాడే

మైనా ఘనకార్యం

చేశాడేమోనని నా అనుమానం.

నాతోపాటు వెంకట్రావుని తీసుకు వెళతాను. కాస్త ప్రపంచం ఎలా ఉందో చూస్తాడు. మనకు మనం గిరిగీసుకుని ఇదే ప్రపంచం అనుకుంటే సరైనది కాదని తెలుసుకుంటాడు"

మొత్తానికి అప్పటివరకు భీకరంగా సాగిన వాదాలకు సంధి ప్రకటించి వెంకట్రావ్‌తో కలిసి పిల్లాడి స్కూల్‌కి బయల్దేరాడు ప్రసాద్. కానీ అసలు కథ ముందున్నదని ప్రసాద్‌కు తెలీదు.

* * *

"రాహుల్ ఫాదర్ మీరేనా... రండ్రండి.. కంగ్రాట్స్ మీకు.. వుయ్ ఆర్ ప్రౌడ్ ఆఫ్ హిం" అసలు విషయం చెప్పకుండా ప్రసాద్‌ని పొగడ్తలతో ముంచేశాడు ప్రిన్సిపల్.

ప్రసాద్‌కి టెన్షన్ పెరిగిపోతోంది. అసలు విషయం చెప్పకుండా ఈ సోదేమిటి అనుకున్నాడు. కాస్త వాతావరణాన్ని తేలికబరచటానికి వెంకట్రావు అన్నాడు. "ప్రిన్సిపల్‌గారూ ఇంతకీ మీరసలు విషయం చెప్పటం లేదు...చెప్పండి సార్ మీరు అంతగా పొగిడేంత ఘనకార్యమేం చేశాడు మావాడు" లాభం లేదని ప్రసాదే రంగంలోకి దిగాడు.

"మీ అబ్బాయి మీకు చెప్పాడో లేదో... మీ వాడికి ఈసారి ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. అయితే మిమ్మల్ని దానికి పిలవలేదు. మీ వాడికి, సెకండ్ ర్యాంక్ వచ్చిన కుర్రాడికి రెండే మార్కులు తేడా... ఆ కుర్రాడి మీద ఫస్ట్ ర్యాంక్ కోసం వాళ్ల అమ్మ, నాన్న విపరీతమైన ప్రెషర్ పెడుతున్నారు. అందులో లాస్ట్ రెండుసార్లు ఆ కుర్రాడు కొద్దిలో ఫస్ట్ ర్యాంక్ మిస్ అవుతూ వస్తున్నాడు. ఆ కుర్రాడి పేరు చెప్పలేదు కదూ... హి ఈజ్ రోహిత్. ఈసారి వాళ్లమ్మ వచ్చి ఆ కుర్రాడు ఎంత కష్టపడింది, అయినా ఎలా మిస్సవుతున్నాడు... ఏకరువు పెట్టింది. ఆ కుర్రాడి మదర్ కన్నా ఆ కుర్రాడి గురించే నేను ఎక్కువ వర్రీ అయ్యాను. వాళ్ల నాన్న ఎలా తిట్టింది నాకు వాడి ముఖంలో కనిపించింది. అలాంటప్పుడు మీ రాహుల్ వచ్చి చాలా నిజాయితీగా 'సార్ తెలుగులో నేను ఎక్స్‌ట్రా ఆన్సర్ రాశాను. దానికి నాకు 3 మార్కులు వేశారు. అవి తీసేస్తే ఫస్ట్ ర్యాంక్ రోహిత్‌కు వస్తుంది. నాకు ఫస్ట్ ర్యాంకు రాలేదు. ఆ ఫస్ట్ ర్యాంక్ రోహిత్‌దే' అన్నప్పుడు ఒక్కసారి నా కళ్లను నేనే నమ్మలేకపోయానంటే నమ్మండి. తనకు ఈ విషయాన్ని మాకు చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఫ్రెండ్ మొహంలో బాధను చూసి ఎంతో సిన్సియర్‌గా మార్కులు కట్ చేయించుకున్నాడు"

ఎవరండీ ఈ రోజుల్లో ముఖ్యంగా పిల్లల్లో అంత సిన్సియర్‌గా ఉండేది. ఒక పేరెంట్‌గా ఇందులో మీ రోల్ చాలా ఎక్కువగా ఉందని నాకనిపించింది. అందుకని మిమ్మల్ని పిలిచి పర్సనల్‌గా అభినందిద్దామనిపించింది. అంతేకాదు మా స్టాఫ్ అందరికీ మిమ్మల్ని పరిచయం చేద్దామనిపించింది. లేనిది క్లెయిమ్ చేస్తున్న రోజులివి. అట్లాంటిది మీ రాహుల్‌లోని నిజాయితీ... హేట్సాఫ్ టు హిమ్ అండ్ టు యూ"

ప్రిన్సిపల్ మాటలకు కళ్లు బైర్లు కమ్మాయి ప్రసాద్‌కి. తను ఏమనుకుని వచ్చాడు... ఏం జరిగింది..? ఏ పెంపకం గురించి తను ఆందోళన చెంది ఒక కొత్త రూపు ఇవ్వాలనుకున్నాడో దాన్ని ఆదర్శప్రాయంగా చెబుతున్నాడు ప్రిన్సిపల్.

ఆ క్షణంలో తండ్రి తన కొడుకు రూపంలో తనని వక్రమార్గం వైపు వెళ్లకుండా కాపాడడం కోసం తన చెంప ఛెళ్లుమనిపించాడనిపించింది ప్రసాద్‌కి.